
# హిట్లర్ జ్ఞాపకాలు

మొదట్లో నేను బంజారాహిల్స్‌లో పెంపుడు కుక్కగా ఉండేదాన్ని. నీలిరంగు ఆకాశం కళ్లకు విందు చేస్తుండగా, కొండపైన ఉన్న బంగళా అది. ఆ ఇంట్లో మనుషులందరు దేవతల్లా ఉండేవాళ్లు. పగలు నిశ్శబ్దంగా ఉంటుంది. ఒక మగవాడు. ఒక ఆడమనిషి. అతనో పెద్ద అధికారి. ఆమె గొప్ప అందగత్తె. గొప్పగా పాడుతుంది.



ఆమె నడుస్తున్నప్పుడు కూడా అడుగులు సన్నని పాటను హమ్ చేస్తున్నట్లుగా ఉండేవి. సంగీతం గురించిన జ్ఞానం అప్పుడే నన్ను పట్టుకుంది. అట్లాగే పుస్తకాల గురించిన సంగతులు. పగలంతా ఆమె వందలాది పుస్తకాల షాపుల చుట్టూ తిరిగేది. సాయంకాలానికి పదో, ఇరవయ్యో పుస్తకాలతో ఇంటికి వచ్చేది. సోఫాలో కూర్చుని, నా జుట్టు నిమురుతూ, పుస్తకాల నుంచి మనోహరమైన వాసన వస్తుందని నాకు అప్పుడే తెలిసింది. మరొక వాసన కూడా అప్పట్లో నన్ను ఉగ్రూత లూగించేది. మాంసాహారపు వాసన. ఇంటి యజమానికి మాంసపు వంటకాలంటే ఇష్టం. కోడి (ముఖ్యంగా నాటుకోడి), మేక మాంసం (బాగా కొవ్వు పట్టినది), చేపలు (ముఖ్యంగా చెరువుల్లో పట్టిన చేపలు), పీతలు, ఎండ్రకాయలు (ఆయన, సెక్రటేరియట్‌లో పెద్ద అధికారి, ఆయనను మంచి చేసుకోడానికి రకరకాల మాంసాలను ఆయన కోసం తెచ్చేవాళ్లు.) నేను బాగా ఇష్టపడ్డవి కుందేలు మాంసం (మెత్తగా, పంటికి మృదువుగా తగిలేది), కౌజుపిట్ట మాంసం (ఆహా, దీని వాసనకే నా నోరు ఊరేది.)

ఒకసారి, ఆయన బీఫ్ మాంసం (దున్నపోతు మాంసం) కూడా రహస్యంగా తెప్పించుకున్నాడు. (ఆయనైతే ఇష్టంగా తిన్నాడుగాని, నేను రాత్రంతా నేలపై పొర్లుతూ, లోపలి మాంసాన్ని అరగబెట్టుకోడానికి తంటాలు పడ్డాను.)

రాత్రిపూట ఆమె సంగీతం, పుస్తకాల వాసన, ఇదుగో ఈ మాంసపు తిండ్లు, ఆ రోజులు మరపురానివి.

## 2

నేనిప్పుడు వీధికుక్కని. ఆ యింట్లోంచి నేను ఎందుకు బయటకు వచ్చాననేది గుర్తుచేసుకుంటే, భయంతో వణికిపోతాను.

“నువ్వు ఈ ప్రాంతపుదానివి కావే?” అంటాయి నా సహచర కుక్కలు.

“నేను సుహాసిని మేడమ్ పెట్ డాగ్‌ని” అని చెపుతాను. (నాకు ‘కెంజాయ’ అనే అందమైన పేరు ఉన్నదని వాళ్లకు చెప్పలేదు)

"చెప్పు, చెప్పు ఆ విశేషాలు చెప్పు," అంటూ నా చుట్టూ మూగేవి.

సుహాసినీ మేడం ఒక రాత్రిపూట రహస్యంగా ఆ యింట్లోంచి వెళ్లిపోయింది. 'దట్ బిచ్' అంటూ పరమ కోపంగా, అడవుల్లోని మదపుటెద్దులా ఆయన వేసిన రంకెలు నాకింకా గుర్తున్నాయి. ఆమెకు సంబంధించిన ప్రతి వస్తువును ధ్వంసం చేశాడాయన. అపురూపంగా చూసుకొనే ఆమె వీణను, సేకరించుకొన్న అందమైన బొమ్మలను, ముఖ్యంగా ఆమె పుస్తకాలను, పుస్తకాలన్నిటినీ వరండాలోకి విసిరి, వాటి పై పెట్రోలు పోసి అవన్నీ తగలబడిపోయి, మంటలు మంట లుగా, నల్లటిపొగలా... నాకైతే సుహాసినీ మేడమ్‌నే వాడు తగల బెట్టుతున్నట్లుగా అనిపించి, పుస్తకాలు తగలబడుతుంటే ఒక వెగటు వాసన, చర్మం తగలబడుతున్నట్లుగా కమురు వాసన రావటం నేను గమనించాను. మనసు విరిగిపోయి, అక్కడ నుంచి వచ్చేశాను.

## 3

'నువ్వేమిటి? నీ జాతేమిటి?' నా సహచర కుక్కలు నన్ను అడిగేవి? బ్లడ్హౌండ్, ఆల్సేషన్, జర్మన్ షెఫర్డ్, డాల్మేషన్, ఆ పేర్లన్నీ, అవి ఉచ్చరిస్తూ, 'వీటిల్లో నీ జాతి ఏది?' అని నన్ను వెటకారంగా అడిగేవి. ఇది వాటి రాజ్యం. నేను రోషపడితే లాభంలేదు. నాకో గొప్ప వారసత్వం ఉన్నమాట నిజం. దాన్ని గురించి వీళ్లకెందుకు చెప్పాలి?

నేను వందేళ్లనాటి హైదరాబాద్‌లా, సెపియా రంగు ఫొటోలా ఉంటాను. నా పూర్వీకుల గురించిన స్పృహ (ఆత్మజ్ఞానం) నాకెట్లానో కలిగింది. గొప్ప సాంప్రదాయక వారసత్వం నాది.

మా అమ్మవైపు వాళ్లు మహా శౌర్యవంతులు. నవాబుల లోగిళ్ల లో కావలి ఉన్నవాళ్లు. పద్దెనిమిదివందల ఎనభై ప్రాంతాల్లో 'దీవానే షేర్' అంటూ మా మాతామహి పూర్వీకులు బిరుదును సంపాదించు కున్నారు.

సరి, మా నాన్నవైపు వాళ్లను తల్చుకుంటే, ఒళ్లు గగుర్పాటు కలుగుతుంది. మహాభారతం నాటి సంగతులవి. యుధిష్టురునితో

పాటు నడిచి వెళ్లిన కుక్క గుర్తుంది కదా, అది మా పితామహుల పూర్వీకులకు చెందినది. యుధిష్టరినితోపాటు నడుస్తూ ద్రౌపది, సహదేవుడు, నకులుడు, అర్జునుడు, చివరకు భీముడు, అందరూ మధ్యలోనే అదృశ్యం అయ్యారు. పెద్దాయనతో చివరిదాకా నిలిచింది మా తండ్రుల పూర్వీకుడే. మంచు నిండిన హిమాలయాల్లో నడిచీ నడిచీ, తిండిలేక శుష్కించి, అయినా తన యజమానిని వదలలేదు. చివరకు స్వర్గారోహణ సమయంలో ప్రవేశం నిరాకరించబడి, అయితే యుధిష్ఠిరుడు దేవతలతో వాదించి, గెలిచి చరిత్ర మొత్తంలోనూ స్వర్గారోహణ చేసిన ఏకైక కుక్క నా పూర్వీకులకు చెందినదే.

నేను వీధికుక్కగా ఉన్నప్పుడు, చాలా ఇబ్బందులుపడ్డాను. మురుగు కాలవల పక్కన, చెత్తకుండీల దగ్గర దోమలు, ఈగలు ముసిరి, తినడానికి ఏమీ దొరక్క నా సహచర వీధికుక్కలు నావైపు అపనమ్మకంగా చూసేవి. (నా వంటి రంగే దానికి కారణం) తిండి సరే, మాట్లాడేవాళ్లు, మాట్లాడుకోకుండా ఉండటం ఎంత దుర్భరం. ఒక రాత్రిపూట రోడ్డు దాటి ధైర్యంచేసి ఒక ఎత్తైన గోడను లంఘించి, విశాలమైన ఒక ప్రదేశంలో అడుగుపెట్టాను. లోపల రోడ్లు, ఎత్తైన భవనాలు, వెలుగుతున్న దీపాలు, రోడ్డు పక్కన నడుస్తుంటే బాగా పరిచయమైన వాసన ఏదో ముక్కులకు తగిలింది. అది పుస్తకాల వాసన. సుహాసినీ మేడం చేతుల్లోని పుస్తకాల్లోంచి వేసే మధురమైన వాసనలాంటిది. పుస్తకాల వాసనపై నాకున్న ఇష్టం కారణంగా ఆ ప్రదేశాన్ని నా నివాసంగా చేసుకోడానికి నిర్ణయించుకున్నాను. అది ఇంగ్లీషు యూనివర్సిటీ.

## 5

ఇంగ్లీషు యూనివర్సిటీలో చాలాచోట్ల ఉన్నాను. మొదట్లో రీసెర్చి స్కాలర్ వింగ్‌లో 'డి' అనే అతని రూమ్ దగ్గర ఉండేదాన్ని. భరింపలేని ఆల్కహాల్ వాసన. కొన్నాళ్లు 'ఎఫ్' రూమ్ దగ్గర. కిల కిలలు, కేరింతలు, గాఢమైన నిట్టూర్పులు. ఒకవిధమైన మదపు

వాసన. అర్ధరాత్రి ఎప్పుడో రబ్బరు తొడుగులు నా ముఖంపై పడేవి. 'హెచ్' ఎప్పుడూ స్నానం చెయ్యడు. ఉప్పువాసన ఆ గది నుంచి. 'జె' నిరంతరం పాటలు పాడేది. 'కె' గదిలో ఎప్పుడూ పొయిట్రీ విని పించేది. చివరకు 'ఎస్' గది నాకెంతో నచ్చింది. నాకిష్టమైన పుస్తకాల వాసన ఆ గదిలోంచి వచ్చేది. 'ఎస్' (సత్యసుందరం) కూడా రోజూ సంచినిండా (భుజానికి తగిలించుకొని) పుస్తకాలతో గదికి వచ్చేవాడు. రాత్రి రెండు, మూడుదాకా ఆ గదంతా పుస్తకాల పరిమళం. అట్లా సత్యసుందరం రూమ్ నా పర్మినెంటు నివాసమైంది.

## 6

రూమ్ ముందరి గచ్చుపై పడుకొని, అటూఇటూ పొర్లు తుంటానా? (నిద్రరాక), లోపల గదిలో నా యజమాని సత్యసుందరం మేలుకొనే ఉంటాడు, టేబుల్ పైని లాంతరు వెలుగులో పుస్తకాల మధ్య తలదూర్చి. సత్యసుందరం నా యజమానేనా; అవుననే నా సమాధానం.

మెస్ నుంచి నాకోసం తెచ్చిన చపాతీల సాక్షిగా, అర్ధరాత్రి ఒక్కడే వరండాలో పచార్లు చేస్తూ, స్వగతంలాగా మాట్లాడుకుంటూ, నాకు చేసిన జ్ఞానబోధ సాక్షిగా, పగటిపూట ఇంగ్లీషు యూనివర్సిటీ రోడ్లపై గర్వంగా అతని వెనుక నడుస్తూ ఉంటానా, 'హి యీజ్ మై ఆల్టర్ ఎగో, కాల్ హిమ్ హిట్లర్,' అంటూ నన్ను మిత్రులకు చేసిన పరి చయం సాక్షిగా, జాక్ లండన్‌తోపాటు మంచు అడవుల్లో నడిచిన కుక్క గురించిన కథ, మంచుపర్వతాలపై ఆ కుక్క సాహసాలు, చలికి, మంచు తాకిడికి తట్టుకోలేక, చలిమంట రగిలించుకోలేని స్థితిలో, యజమానితో సహా మరణించడానికి నిర్ణయించుకొన్న ఆ ధీరోదాత్త కుక్క గురించిన కథను నాకు వివరించిన నాటి రోజు, నా కళ్ల నిండా కురిసిన కన్నీటి సాక్షిగా, 'హిట్లర్' అంటూ నన్ను ఇష్టంగా దగ్గరకు తీసుకునే క్షణాల సాక్షిగా, పొద్దున్నే ఆయనతోపాటు నేనూ సాగించే గాయత్రి సాక్షిగా (మొత్తం ఇరవైనాలుగు బీజాక్షరాలూ నాకు కంఠతా వచ్చు), ఉదయాన్నే సూర్యుని ఎదురుగా మోరలెత్తి, నా యజమాని

కోసం నేను చేసే ప్రార్థన సాక్షిగా, నన్ను నేను సత్యసుందరానికి అంకితం చేసుకున్నాను.

**7**

ఇంగ్లీషు యూనివర్సిటీ నాకెంతో నేర్పింది. నేను చాలా మారి పోయాను. గంభీరంగా ఉండటం నేర్చుకున్నాను. లైబ్రరీ ఆడిటో రియమ్, క్లాస్‌రూములు నాకు ప్రియమైన ప్రదేశాలు అయ్యాయి. నేను మొరిగే తీరు కూడా మారింది. నాజూగ్గా మెల్లగా, సంగీత పరికరంలా మొరగటం నేర్చుకున్నాను. అయితే దానివల్ల, నా సహచర కుక్కల నుంచి వెలివేతకు గురయ్యాను.

'నువ్వు మమ్మల్ని పలకరించవు. హలో అనవు. మేమేదో తక్కువ జాతివాళ్లం అయినట్లుగా,' అనేవి. అంతేకాదు, ఒక్కోసారి 'ఫాసిస్టు కుక్కా' అని కోపంగా మొరిగేవి.

ఒక రాత్రిపూట పేవ్‌మెంట్ పై నడుస్తుండగా ఒక మగకుక్క నావెంట పడింది. మెల్లగా మాటల్లోకి దించి, నన్ను మృదువుగా ముట్టుకొని, నా శరీరమంతా తడిమి, హఠాత్తుగా అది తీవ్రమైన కోరికతో నాపై పడింది. నేను ప్రతిఘటించాను. (దాని నల్లటి రంగు, దాని శరీరంపై నుంచి వచ్చే చచ్చిన చేపల వాసన నాకు నచ్చలేదు.) 'నువ్వేమనుకుంటున్నావు. నువ్వు ఆడకుక్కవి. పిల్లల్ని కనవలసిన దానివి. ఫాసిస్టు లంజా!' అంటూ నన్ను ఈసడించి వెళ్లిపోయింది. ఈ ఫాసిస్టు అనే పదం నన్నెంతో కలవరపాటుకు గురిచేసింది. సత్య సుందరం రూమ్ బయట ఎవరో 'ఫాసిస్టు (అగ్రవర్ణపు) గూండా' అని ఎర్రసిరాతో రాసి వెళ్లారు. సత్యసుందరం ముఖంలో ఏ ఉద్వేగం లేదు. బకెట్ నీళ్లతో ఆ అక్షరాలన్నీ కడిగివేశాడు.

ఒక సాయంకాలం, గుంపులు గుంపులుగా నల్ల సీతాకోక చిలుకలు ఆడిటోరియం ఎదురుగా ఉన్న పూలమొక్కలపై ఎగురుతూ కనబడ్డాయి. గొప్ప ఆపద (చావులాంటి) నల్ల సీతాకోక చిలుకలు అట్లా ఎగురుతాయని విన్నాను. అవి ఆ ఒక్కరాత్రే కనబడ

తాయి. విశాలమైన రెక్కలతో రాత్రంతా విహారం చేస్తుంటాయి. రాత్రి ముగుస్తూనే రెక్కల రాలిపోయి అవన్నీ రోడ్లపై, చెట్ల పైన చచ్చి పడుంటాయి. నా మనసు గుబులుగుబులుగా అయ్యింది. నాకు తెలియకుండానే దుఃఖం వచ్చింది. రాత్రంతా నేను దిగులుగా మొరుగుతూనే ఉన్నాను.

ఆ మరుసటిరోజు రాత్రి యూనివర్సిటీ అంతా నిర్మానుష్యంగా ఉంది. పగటిపూట గొడవలేవో అయ్యాయట. యూనివర్సిటీ అంతా అలజడిగా ఉందట. ఉదయాన్నే యూనివర్సిటీ గోడలపై 'బీఫ్ ఫెస్టివల్‌కు ఆహ్వానం' అంటూ పోస్టర్లు వెలిశాయట. కొద్దిగంటల్లోనే ఇంకెవరో ఆ పోస్టర్లు పీకివేశారట. అరుపులు, కేకలు, కవాతులు, ఆ రాత్రంతా నేను భయంతో గడిపాను. సమస్తం నిశ్శబ్దంగా ఉంది గానీ, చెట్లకొమ్మలు పెనువేగంతో వీస్తూ, ఝూమ్ ఝుమ్మనే శబ్దాలతో, గుండెలవిసేలా ఎవరో ఏడుస్తున్నట్లుగా ఉంది. రాత్రి రెండుగంటల తరువాత, ఇద్దరు అమ్మాయిలు రూమ్‌వైపు వచ్చారు, రంగు డబ్బా, కుంచెలతో. 'హిట్లర్ మళ్లీ పుట్టాడు. ఫాసిస్టు సుందరం డౌన్ డౌన్' అంటూ రాస్తుందొక అమ్మాయి. నేను అరవటం మర్చిపోయి అటే చూస్తున్నాను. మెల్లగా గొంతు విప్పి 'భౌ భౌ' అంటూ అటు నడిచాను. ఆ అమ్మాయి నావైపు చూసింది. చీకట్లో ఆమె కళ్లు దీపాల్లా మెరుస్తున్నాయి. నా జుట్టు నిమిరి, 'అరవద్దు' అంటూ సైగచేసి, గోడపై సత్య సుందరం డౌన్ డౌన్ అని రాసి, కింద 'దళిత సంఘటన వర్ధిల్లాలి' అంటూ రాసి ఆ అమ్మాయి వెళ్లిపోయింది.

ఈ వారం అంతా సత్యసుందరం తన గదిలోనే. గదినిండా మనుషులు, వాళ్లు గంటలు గంటలు మాట్లాడుకుంటూనే ఉన్నారు. పోస్టర్లు, రంగుడబ్బాలు, కర్రలు, జెండాలు, జైజై అంటూ నినాదాలు, వాతావరణమంతా కొత్తగా అపరిచితంగా ఉంది.

సుహాసినీ మేడం ఇంట్లో ఉన్నప్పుడు నేనొట్టి పెంపుడుకుక్కను. వాళ్లు పెట్టింది తిని, వాళ్ల కోసం ఎదురుచూసి, వాళ్లు రావటంతోటే, వాళ్ల చుట్టూ తోక ఊపుకుంటూ తిరిగి, వాళ్ల చేతుల్ని, కాళ్లను నాకి,

నా 'లాయెల్టీ'ని ప్రకటించుకొని. ఇక్కడ అంతా కొత్తగా ఉంది. వట్టి కుక్కను మాత్రమే కానని, నాకో ప్రత్యేకత ఉందని, చరిత్ర ఉందని, జరిగే సంఘటనల్లో నాకూ భాగముందని అర్థమైంది.

## 8

ఎప్పటిలాగే సత్యసుందరం పొద్దున్నే వాకింగ్ చేస్తున్నాడు. వెలుగు పూలు రాలుస్తూ ఉదయం. మంచుతో తడిచిన చెట్ల ఆకులు. ఎండలో శరీరాన్ని ఆరబెట్టుకుంటున్నాయి. సత్యసుందరానికి తగు మాత్రపు దూరంలో నేను, గంభీరమైన అడుగులతో (ఆయనలాగే).

ముందుగా నేనే గుర్తుపట్టాను. అసహనంతో, కోపంతో భౌభౌ మని అరిచాను. నా కళ్లలో విస్ఫులింగాలు. ఎదురుగా గోడపైన సత్యసుందరం బొమ్మ. శంకుచక్రాలు, ఆభరణాలు, పురాణ పురుషు డిలా, పక్కనే భయంగొలిపే రాక్షస జాగిలంలా నా బొమ్మ; యూని వర్సిటీ మెయిన్ గోడ అది. సత్యసుందరం క్షణంసేపు బిగుసుకు పోయాడు. ఆయన ముఖంలోని ప్రశాంతత చెదిరిపోయింది. బొమ్మ లో సత్యసుందరం పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి నాలుగైదు రంగుల్లో. బొమ్మ పక్కనే నాలుగైదు వాక్యాలు, బహుశా సత్య సుందరం గురించే అయ్యుంటాయి. ఆ వాక్యాల్ని సత్య సుందరం పెద్దగా పైకి చదువుతూ కోపంతో రగిలిపోయాడు.

"హిట్లర్‌కు సరైనవాడు. హిందూ సమాజ ఉద్ధరణకోసం; ఏన్ ఎథంటిక్ ఇండియన్ ఫాసిస్టు ఈ సత్యసుందరం. యూనివర్సిటీ నెత్తిన పసుపు నీళ్లు, కుంకుమ చల్లి, శుద్ధిచేసి, లేడీ స్టూడెంట్లకు మిడ్డీలు, జీన్స్ నిషేధించి, మందుపార్టీలు, డాన్సులు నిషేధించి; మన కొత్త దేవుడు సత్యసుందరం. ఇప్పుడు సరికొత్త ఫత్వాని ప్రకటించాడు. యూనివర్సిటీలో మాంసం తినకూడదని; బీఫ్ ఫెస్టివలా అంటూ కన్నెర్ర చేస్తున్నాడు. భయపడండి, భయపడండి ఈ సత్యసుందరుడి శాసనాలకు."

ఆ మాటల్ని చదువుతూ, పళ్లు కొరుకుతూ, ముఖం ఎర్రబడి సత్యసుందరం ముఖంలోని ప్రశాంతత అదృశ్యమై, తీవ్రమైన కోపంగా

మారిపోయాడు. పదో ఇరవయ్యో ఫోన్లు చేశాడు. అర్ధగంటలో అక్కడ వందకు పైగా జనం మూగారు.

ఎనిమిది గంటలకు, అక్కడ పెద్ద గొడవ మొదలైంది. భయం తో అక్కడ నుంచి పారిపోవాలనుకున్నాను. అయినా నా యజమానిని, ఆయన కష్టాల్లో వదలిపోవడమా, ధైర్యంచేసి, అక్కడే ఒక మూలన; హాస్టల్ నుంచి నాలుగైదు చెక్కకుర్చీలు తెచ్చి, లైబ్రరీ ఎదుట విసిరేసి వాటికి నిప్పుపెట్టాడు. నా యజమాని సత్యసుందరం ముఖంలో మళ్లీ ప్రశాంతత. దేవుడిలా మళ్లీ ముఖమంతా వెలుగు. అందరూ వి.సి. ఇంటి వైపుకు వెళ్లారు. ఆయన ఇంటి ముందు పద్మాసనం వేసుకొని కూర్చున్నాడు సత్యసుందరం.

చుట్టూ ఉన్నవాళ్లు అరుస్తూ నినాదాలు చేస్తూ, కాసేపటికి వి.సి. సత్యసుందరాన్ని లోపలికి పిలిచాడు. కొద్దిసేపయినాక సత్యసుందరం జైజై అంటూ అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. నేను మళ్లీ యూనివర్సిటీ ముందరి గోడ దగ్గరకు వెళ్లాను. బొమ్మ ఎదురుగా కూర్చుని; నా బొమ్మవైపు పదేపదే చూసుకున్నాను. ఎంత అందంగా, ఎంతో కోపంగా, యుద్ధాల్లో పాల్గొనే కుక్కలా (కొద్దిగా ఆనందం వేసింది) మధ్యాహ్నందాకా అక్కడే కూర్చున్నాను. మధ్యాహ్నానికి రెండు పోలీసు వేన్లు దిగాయి. పోలీసులు చేసిన మొదటి పని గోడపైన బొమ్మను చెరిపివేయటం. బకెట్లతో నీళ్లు పోసి, బ్రష్‌లతో తుడిచి; గోడ ఖాళీగా అయిపోయింది.

యూనివర్సిటీలో జనసంచారం ఆగిపోయింది. పోలీసులు పోస్టర్లు అన్నీ చించేశారు. బొమ్మలు తుడిపేశారు (వాటిని గ్రాఫిటీ అంటారని తెలిసింది).

మరుసటిరోజు నా యజమాని సత్యసుందరంతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్నప్పుడు, పోలీసులింకా నిద్రపోతూనే ఉన్నారు. గోడలన్నీ ఖాళీగా ఉన్నాయి. దేవుడి ముఖంలాంటి ముఖం ఉన్న సత్యసుందరం ముఖంలో సన్నని చిరునవ్వు కనిపించింది. మేము నడుస్తూ, నడుస్తూ, సరిగ్గా ఆరుగంటలకు ఆడిటోరియంవైపు నడిచి,

అక్కడ మళ్లీ మరో బొమ్మ. బొమ్మలో పదిమంది సత్యసుందరాలు. 'ది ఎవల్యూషన్ ఆఫ్ ఫాసిస్ట్ గాడ్' కలతచెందిన ముఖంతో బొమ్మ కింద మాటల్ని పదేపదే గొణుక్కున్నాడు సత్యసుందరం. చిట్టచివరి బొమ్మలు సత్యసుందరం మిలటరీ యూనిఫాంలో, చేతిలో లాఠీ కర్రతో (ఈసారి నా బొమ్మ లేకపోవటం కాస్త అసంతృప్తినిచ్చింది నాకు).

బొమ్మ చుట్టూ (అందరూ దాన్ని గ్రాఫిటి అంటున్నారు) ఇరవై మంది మూగారు. సత్యసుందరం వైపు సానుభూతిగా; సత్యసుందరం ముఖంలోంచి దేవుడు అదృశ్యం అయ్యాడు. కోపంగా రూమ్ వైపు నడిచాడు సత్యసుందరం. నేనూ అనుసరించాను. దిగులు, భయం, కోపం ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు. కాసేపు పద్మాసనం వేసుకొని, కళ్లు మూసుకొని, కాసేపు పుస్తకాన్ని తెరిచి, గాఢంగా నిట్టూర్చి, లేచి నిలబడి, సైనికుడిలా ఎటెన్షన్‌లో నిలబడి; తనలో తాను ఏదో గొణుక్కుని, నేనంతా గమనిస్తూనే ఉన్నాను. సన్నగా మొరిగాను. ఆయన దగ్గరకు వెళ్లి పాదాల్ని నాకాను. నన్ను దగ్గరకు తీసుకొని, నా తలను నిమిరి, నాతో చెబుతున్నట్లుగా, "స్టిల్ ఇట్ హర్ట్స్ మి," అన్నాడు సన్నటి స్వరంతో.

ఎనిమిది గంటల సమయంలో బొమ్మవైపు వెళ్లాను. ఆ బొమ్మల్లో ఎంత అందంగా ఉన్నాడు నా యజమాని. ఆ బొమ్మల్లోని సత్యసుందరాన్ని ఇష్టపడుతుండగానే, పోలీసులు బకెట్లతో నీళ్లు తెచ్చి, బొమ్మలు చెరిగిపోయి, గోడ ఖాళీగా చూస్తుంది.

మధ్యాహ్నానికి ఆడిటోరియం మరో గోడపై సత్యసుందరం వెలిశాడు. చాలామంది స్టూడెంట్స్, ముఖ్యంగా విదేశీ స్టూడెంట్లు (ఎర్రగా, నల్లగా, తెల్లగా) వాళ్లు బొమ్మల్ని ఎంజాయ్ చేస్తూ, కింద రాసిన మాటల్ని పెద్దగా చదువుతున్నారు. 'మెనీ ఫేసెస్ ఆఫ్ మోరల్ పోలీసింగ్' అంటూ, 'సత్య । సుందరం ది యాంటీ గాడ్, ది యాంటీ మార్క్స్, యాంటీ అంబేద్కర్, యాంటీ దళిత్, యాంటీ ముస్లిం, యాంటీ క్రైస్ట్, యాంటీ హ్యూమన్ బీయింగ్, యాంటీ ఎవ్విరిథింగ్."

ఆడిటోరియంకు అటువైపు యూనివర్సిటీకి రోడ్డుకి మధ్యనున్న గోడ దగ్గర చాలామంది కుర్రాళ్లు మూగి వున్నారు. వగరుస్తూ అటువైపు పరుగెత్తాను. ఎర్రని ఎండలో, చెమట్లు కారుతుండగా, చేతిలో గుప్పెడు రంగు చాకోపీసులతో ఒక అమ్మాయి. మరో సత్యసుందరం గ్రాఫిటీని గీస్తుంది. పులిపై కూర్చుని స్వారీ చేస్తున్న సత్యసుందరం బొమ్మ అది. వరదనీరులా ఆ ప్రదేశమంతా యూనివర్సిటీ విద్యార్థులు. ఆ అమ్మాయి ఏకాగ్రతతో బొమ్మ గీస్తుంది. వెనకనుంచి ఎవరో ఆ అమ్మాయిపై రాయి విసిరారు. ఉలిక్కిపడి వెనక్కు చూసింది. లేత ముఖం, కళ్లనిండా దయ, చెమట్లు కారుతుండగా, గ్రామదేవత ఎల్లమ్మ తల్లిలా, 'కరుణకుమారి ఫస్టియర్' అంటూ ఎవరో అరిచారు. వందలాదిగా ఆశ్చర్యాలు, నిట్టూర్పులు. నా ముక్కు లకు ఇష్టమైన వాసన తగిలింది. సత్యసుందరం వస్తున్నాడు. జనాల్ని చీల్చుకొని ఆ అమ్మాయివైపు నడిచాడు (నమ్మకమైన సేవకుడిలా నేనూ వెంట నడిచాను). ఆ అమ్మాయి చెయ్యి పట్టుకొని లాగాడు. ఈడ్చి చెంపపై కొట్టాడు. ఆ అమ్మాయి ముఖంలో సన్నటి నవ్వు; అంతట్లో పోలీసులు. కరుణకుమారిని అరెస్ట్ చేశారు. ఆ అమ్మాయి ముఖంలో నాకు ఇష్టమైన ఏవో పోలికలు కనబడ్డాయి. ఈసారి బొమ్మలో నన్ను గీసింది. పెద్దపులి పక్కనే, నా యజమాని వైపు ఇష్టంగా చూస్తూ, భౌభౌ మని పెద్దగా అరచేను. నా గొంతులో కోపం లేదు.

సాయంకాలమైంది. కొద్దిగా చీకట్లు కమ్ముకున్నాయి. సత్యసుందరం రూమ్ బయటకు వచ్చి 'కమాన్ హిట్లర్' నాకు ఆజ్ఞ ఇచ్చాడు. యజమానిని అనుసరించాను. యూనివర్సిటీ దాటి తార్నాక వైపు నడిచాడు. టీస్టాల్ దగ్గర ఆగి, ఘాటైన టీ తాగి (నాకు రెండు బిస్కెట్లు విసిరి) మళ్లీ యూనివర్సిటీ వైపు నడిచాడు. గోడలన్నీ ఖాళీగా ఉన్నాయి. పోలీసులు బొమ్మలన్నీ చెరిపివేశారు. రోడ్డు పక్కనున్న రాగిచెట్టు కింద చాలాసేపు కూర్చున్నాడు. స్ట్రీట్ లైటు వెలుతురు సత్యసుందరంపై దాడి చేస్తున్నటుగా; చాలాసేపు అట్లాగే కూర్చున్నాడు సత్యసుందరం. చీకట్లు పెరిగి, చప్పుళ్లన్నీ ఆగిపోయి;

హఠాత్తుగా సత్యసుందరం పైకి లేచాడు. ఆయన ముఖంలో ఆవేశం, గట్టిగా నిట్టూర్చాడు. కిందపడి ఉన్న రంగు చాక్‌పీసులను ఏరుకొని, గోడ పైన బొమ్మని గీయటం మొదలుపెట్టాడు, శ్రద్ధగా, దీక్షగా. అది కరుణకుమారి బొమ్మ. బట్టలు లేకుండా, దిశమొలతో. బొమ్మ పూర్తిచేశాక ఆయన ముఖంలో ప్రశాంతత. అన్నివైపులకు చూశాడు. ఎవరూ కనబడలేదు. కుడిచేత్తో, బొమ్మలోని కరుణకుమారి స్తనాల్ని ముట్టుకున్నాడు. చేతిని ముందుకు జరిపి, కాళ్ల మధ్య ప్రదేశాన్ని ముట్టుకున్నాడు. 'లంజా' అంటూ పెద్దగా అరిచాడు. అతని లోని బరువైన ఊపిరులు ఆగి, కాస్త నెమ్మదించి, వడివడిగా అడుగులు వేసుకుంటూ రూమ్ వైపు నడిచాడు. నేను నా నాయకుణ్ణి అనుసరించాను.

## 9

యూనివర్సిటీలో బీఫ్ ఫెస్టివల్ జరిగిన రోజు, నా యజమాని సిటీలో లేడు. సాయంకాలం నాలుగు గంటలకు, కమ్మటి వాసన నా ముక్కులకు తగిలింది. మనోహరమైన మాంసం వాసన. మాంసం, మసాలాలతో కలిసి ఉడుకుతున్నప్పుడు వచ్చే వాసన. తట్టుకోలేని కోరిక. కానీ, సత్యసుందరానికి మాంసం తినడం నచ్చదు. కోరికను ఆపుకొని రూము ముందు పచార్లు చేస్తున్నాను. మధురమైన పాటలు, డప్పుల శబ్దాలు, గాలినిండా పాటలు, కోలాహలాలు. సమీపంలోనే ఒక పండుగ. నేను వెళ్లలేని స్థితి. కాస్త చీకటిపడ్డాక పోలీసు సైరన్ల శబ్దాలు విని ఉలిక్కిపడ్డాను. అంతలో అరుపులు, కేకలు, మనుషులు కనబడుతున్న శబ్దాలు, మెల్లిగా అటు నడిచాను. యుద్ధరంగంలా అటు ఒక సేన, ఇటు ఒక సైన్యం. ఆయుధాలు ధరించి, గుండిగ ల్లోని మాంసం రోడ్డుపై దొర్లాడుతూ... వాతావరణమంతా మాంసం వాసనలు, ఉడికిన మాంసం ముక్కలు చెట్ల కొమ్మలకు వేళ్లాడుతున్న ట్లుగా; నా నోరు ఊరుతుంది. చాటుగా ఒక మాంసంపు ముక్కను నోట కరుచుకోవాలని కోరిక. నాలుక మెలికలు తిరిగిపోతుంది. ఎవరో

నన్ను గుర్తుపట్టి 'సుందరం పెట్ డాగ్' అంటూ నన్ను అక్కడి నుంచి తరిమి వేయటంతో ప్రమాదం తప్పింది. గొడవలు కొనసాగుతున్నాయి. రాత్రి తొమ్మిది తరువాత, మళ్లీ పాటల శబ్దాలు వినబడ్డాయి. మాంసం వంటకాల ఘుమఘుమలు. ఆ రాత్రంతా నిరాహారంగా నా యజమాని ఇంటి ముందే పడుకున్నాను.

**10**

రెండు రోజుల తరువాత నా యజమాని, నల్లటి రాత్రిపూట, చీకటి ముద్దలా వచ్చాడు. సత్యసుందరం శరీరమంతా వింతవాసన వస్తుంది. అడవులు తగలబడుతున్న వాసన. పచ్చటి చెట్లు కాలుతున్న వాసన. అతని శ్వాసలోనూ, శరీరం నిండా. 'ఆత్మ తగలబడుతున్న వాసన రావటం లేదా?' అన్నాడు, తనను చూడడానికి వచ్చిన వాళ్లతో. నేను ఆయన పక్కనే కూర్చుని, ఆయన పాదాల్ని నాకుతూ; ఆయనకెన్నో ముచ్చట్లు చెప్పాలని నా కోరిక. ముఖ్యంగా బీఫ్ ఫెస్టివల్ గురించి, బలమైన కోరికను ఆపుకున్నానని, మాంసాన్ని ముట్టలేదని.

లేచి, కిటికీలు తెరిచి పద్మాసనంలో కూర్చున్నాడు. బయట రోడ్డుపైనున్న ట్యూబ్ లైటులోంచి వెలుతురు కిటికీలోంచి జారి, ఆయన ముఖంపై పడుతుంది. ఆయనలో ఒక విస్ఫోటనం జరుగుతున్నట్లుగా, తగలబడుతున్న వాసన గదంతా. చాలాసేపటి తరువాత లేచి బయటకు వచ్చి, "ఏదైనా చెయ్యాలి మనం. ఈ అరాచకాన్నీ ఆపాలి," అన్నాడు. అనుచరులందరూ (స్నేహితులు) ఒక్కసారిగా బిగుసుకుపోయారు.

"ఈ అనార్కిస్టులకు వ్యతిరేకంగా, వాళ్లకు బుద్ధిచెప్పేలా..." అంటూ దీర్ఘంగా ఆలోచించి, నిట్టూర్చి, "వాళ్లకిష్టమైన పుస్తకాల్ని తగలేద్దాం" అన్నాడు.

అనుచరులు ఆలోచిస్తున్నారు.

"ఫిలాసఫీ, హిస్టరీ, లిటరేచర్, హిందూ సమాజానికి వ్యతిరేకమైన ప్రతి పుస్తకాన్నీ తగలేద్దాం; ఎక్కడైతే బీఫ్ ఫెస్టివల్ జరిగిందో,

ఆ ప్రదేశంలోనే మనకు వ్యతిరేకమైన సమస్త జ్ఞానాన్నీ తగలేద్దాం,'' అన్నాడు ఆజ్ఞ ఇస్తున్న నాయకుడి స్వరంతో.

సత్యసుందరం శరీరమంతా వెలుగు. అతని శరీరం మొత్తం తగలబడుతున్నట్లుగా; అగ్నివృక్షంలా కనబడ్డాడు. పుస్తకాలు, తగలబెడదాం... మాటలు విని ఉలిక్కిపడ్డాను. నా మెదడులో ఎప్పటివో జ్ఞాపకాలు.

మొత్తం నలభైమంది ఆ ప్రదేశంలో 'End of Anarchism' అంటూ 'భారతీయతను కాపాడుకొందాం', 'భారతమాత వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఇటుకలతో పేర్చిన హోమగుండంలాంటి ప్రదేశంలో, కట్టెలను పేర్చి, మంటను రగిలించారు. సత్యసుందరం లేచి వచ్చాడు. 'Complete works of Shakspeare' అంటూ పెద్దగా పుస్తకం పేరు చదివి, దాన్ని మంటల్లోకి విసిరాడు. దూరంగా నిలబడి, ఆ దృశ్యాన్ని చూస్తున్నాను. కడుపులో తిప్పుతున్నట్లుగా ఉంది. సుహాసినీ మేడం గుర్తుకొచ్చింది. పుస్తకాన్ని కాదు, ఎవరో మనిషిని తగలబెడుతున్నట్లుగా అనిపించింది.

సత్యసుందరం ముఖంలో ఏదో ఆందోళన. అతని ముఖంలో కనబడని వత్తిడి. గుబురుగెడ్డం చాటునున్న అతని ముఖం కదలికలు నేను గుర్తుపట్టగలిగాను. సత్యసుందరానికి పుస్తకాలంటే ఎంత ఇష్టమో నాకు తెలుసు. ఇంకో కుర్రాడు, తన సంచిలోంచి పుస్తకాన్ని తీసి 'డెరీడా, గిఫ్ట్ ఆఫ్ డెత్' అని చదువుతూ మంటల్లోకి విసిరాడు దాన్ని. ''హిస్టరీ । పుస్తకాలన్నీ తగలేద్దాం,'' అన్నాడు సత్యసుందరం. ''హిస్టరీ పుస్తకాలన్నీ కట్టుకథలు. మనకు వ్యతిరేకంగా బ్రిటీష్ హిస్టారియన్లు, వాళ్ల తొత్తులు, కొద్దిమంది కమ్యూనిస్టులు రాసిన పుస్తకాలివి,'' అన్నాడు తీవ్ర స్వరంతో సత్యసుందరం, ఒక్కొక్క పుస్తకమే రచయితల పేర్లు చదువుతూ, మంటల్లో విసిరేస్తున్నారు. రోమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్, ఆర్.ఎస్. శర్మ, మజుందారు, కంభంపాటి గుట్టలుగా పుస్తకాలు మంటల్లోకి విసిరేయబడ్డాయి. చాలామంది

మనుషులు సామూహికంగా తగలబడుతున్నట్లు, నాలో ఆపుకోలేని ఆందోళన, దుఃఖం; అక్కడనుంచి పారిపోవాలని.

అన్ని రూములకు వెళ్లి స్టూడెంట్లను లాక్కువచ్చారు. "సర్పయాగం జరుగుతుంది. మనకు వ్యతిరేకమైన శాస్త్రాలన్నిటినీ తగలబెడదాం, రండి," అంటూ. వందలుగా అక్కడ మూగారు.

హఠాత్తుగా వాన చినుకులు మొదలయినాయి. ఆరుతున్న మంటలో, పదేపదే పెట్రోలు పోస్తున్నారు. వర్షం పెరిగింది. పెను జల్లులు అన్నివైపుల నుంచి. పుస్తకాల తాలూకు మంట ఆరిపోయింది. సగం కాలిన పుస్తకాల నుంచి కమురు వాసన ఏదో, ఎవరిదో శరీరం; సగంసగం తగలబడినట్లుగా, సుహాసినీ మేడం శరీరమేనా, అక్కడ; "నీషే, ఏంటీ క్రైస్ట్," అరుస్తున్నారు ఎవరో. 'ట్రూటీ ప్రాఫెట్ ఆర్మ్' పుస్తకాల్ని విసిరేస్తున్నాడు. సీసాలతో పెట్రోలు పోస్తున్నారు. మంట భగ్గుమంటుంది.

సత్యసుందరం ముఖంవైపు చూశాను. ముఖంలోని దయ, కరుణ, ఆలోచన అన్నీ మాయమైనవాడిలా ఉన్నాడు. మొదటిసారిగా అతనిపై అయిష్టం కలిగింది. అతనేకాదు మనిషి వెధవలందరి మీద. పుస్తకాలు తగలబెట్టు కొనే జాతి అనుకున్నాను.

సత్యసుందరం ఉన్మాదిలా మారిపోయాడు. వర్షంలో తడుస్తూనే లైబ్రరీ వైపు పరిగెత్తాడు. పెద్ద పెద్ద రాళ్లతో లైబ్రరీ కిటికీ అద్దాలు పగలగొట్టాడు. పదిమంది కుర్రాళ్లు లోపలకి దూరి లోపల బీరువాలు పగలగొట్టి; గుట్టలుగుట్టలుగా పుస్తకాలు పోగుబడ్డాయి. పెట్రోలు పోసి, అగ్గిపుల్ల గీశాడు సుందరం. 'నేను వెళ్లిపోవాలి,' నాలో నేను గొణుక్కున్నాను.

వాన తన వేగాన్ని పెంచింది. కసితో, క్రోధంతో కురుస్తుంది. చెట్లపైన, గోడలపైన, తలుపులు, కిటికీల పైన మడేల్, చడేల్మంటూ వాన శబ్దాలు. పదినిముషాల్లో యూనివర్సిటీ రోడ్లపైన వరదగా నీరు.

కొద్దిగా నిప్పంటుకొని, వాన జోరుకు చల్లారిన పుస్తకాలు,

ఇప్పుడు వరదనీటిలో కొట్టుకుపోతున్నాయి.

వానలో, రోడ్డుపైన నీళ్లలో ఈదుతూ వెళుతున్నాను. దారి తెలియనట్లుగా ఉంది. నడుస్తూ నడుస్తూ, లోతైన గుంటలో (డ్రైనేజి) జారిపడ్డాను. నీటి ఉధృతి పెరుగుతుంది. గుంటలోంచి పైకి గెంత బోయి, కాలు మడతపడింది. బాధగా మూలిగాను. కోపంగా, బాధగా మొరుగుతూ;

ఎవరో నావైపు వస్తున్నారు. సుహాసినీ మేడమ్ కాదుకదా, నీళ్లను చీల్చుకుంటూ, దేవతలా నావైపు వస్తుంది. రెండు చేతుల్తో నన్ను పైకిలేపి, తన గదిలోకి తీసుకెళ్లి; ఆమె చేతుల్లో నేను చిన్నబిడ్డలాగా; నన్ను నేలపై పడుకోబెట్టి, గాయపడిన నా కాలును తన చేతుల్లోకి తీసుకొంది.

వెలుగులో ఆమె ముఖాన్ని చూశాను. గోడల పై బొమ్మలు వేసిన అమ్మాయి. కరుణకుమారి (కొద్దిగా కంగారుపడ్డాను).

బయట రోడ్లన్నీ నీళ్లలో తేల్లాడుతున్నాయి. అది యూనివర్సిటీ కాదు, నది. సగం కాలిన పుస్తకాలు నీళ్లలో తేలుతూ, కొట్టుకుపోతూ.

ఆమె, నా పాదాన్ని తుడిచి, బొట్లు బొట్లుగా కారుతున్న గాయం చుట్టూ, చిటికెడు మందు, దూది పెట్టి, గుడ్డ కట్టి నా కాలును మృదువుగా నిమిరి. నా కళ్లలో నీళ్లు. మనసులో దండం పెట్టు కున్నాను. రెండు బ్రెడ్ ముక్కలు నా ముందు పెట్టి; వరండాలోకి వెళ్లి; వాన, వెన్నెల కలగలిసి కూర్చున్న రాత్రిని ఎంజాయ్ చేస్తూ సన్నగా పాటను హమ్ చేస్తుంది.

యూనివర్సిటీ గోడ కవతల, నా సహచర కుక్కలు, బృంద గానంలా మొరుగుతున్నాయి.

రెండు మనోహరమైన పాటల మధ్యన సత్యసుందరం గొంతు (ఉపన్యాసం), భయం గొలిపేలా వినిపిస్తూనే వుంది.

పాలపిట్ట మాసపత్రిక
*జనవరి 2014*